# త్యాగం

"పెళ్ళివారు ఏమన్నారండీ" నోటివరకు వచ్చిన మాటల్ని ఆపుకుంది రాజ్యలక్ష్మి. ఇంటిలోకి అడుగుపెడుతున్న భర్తముఖం చూసేటప్పటికి ఆవిడకు చెప్పలేని బాధకల్గింది. చెమటలు కారుతూ వాడిపోయిన అతనిముఖంలో ఎక్కడా ఉత్సాహంలేదు. అడిగితే ఆయన ఏమనుకుంటారో. అందుకే అడగలేకపోయింది. ఆయనే చెబుతారని అక్కడే నిలబడింది.

చలపతిరావుగారు భార్యముఖంలోకిచూడలేక వెళ్ళి ఎదురుగా ఉన్న వాలుకుర్చీలో చతికిలబడ్డారు. భుజంమీద ఉన్న కండువా తీసుకుని ముఖం తుడుచుకోబోయారు.

ఉండండి అంటూనె ఆవిడ తువ్వాలు అందించింది.లోపలికి వెళ్ళి మంచినీళ్ళు పట్టుకొచ్చి ఆయనకు ఇచ్చింది.

మంచినీళ్ళు గటగటతాగి కాస్త ఊపిరి పీల్చుకున్నారు. తర్వాత ఆవిడ అందిచ్చిన తువ్వాలుతో ముఖం తుడుచుకోడం మొదలెట్టారు. ఏదో చెప్పాలని పెదాలు కదిపారు.

రాజ్యలక్ష్మి గుండె వేగం హెచ్చింది. ఆయన చెప్పే మాటలకోసం తొందరపడుతోంది. అయినా గుట్టుగా నిలబడింది.

"వాళ్ళకి పాతికవేలు కట్నం కావాలిట" నెమ్మదిగా పలికింది ఆయన కంఠం.

"మనం పదివేలకి మించి ఇవ్వలేమని ముందే కబురుచేసాం కదండీ"

"అవును. అయినా వచ్చారు. పైగా పిల్ల నచ్చిందిట"

"మరి ఇంకా కట్నం దేనికండీ"

"వెర్రిదానా? ఎందుకంటావేమిటి? పిల్ల నచ్చితేనే మిగిలిన సంగతులు. కట్నం ఎంత అడిగితే అంత గొప్పవారన్నమాట. సమాజంలో వాళ్ళ స్టేటస్ అంత పెరిగిపోతుంది.

"కట్నం ఇవ్వడం పుచ్చుకోడం కూడా నేరమే అంటారు కదండీ".

భార్య అమాయకత్వానికి ఆయనలో ఆయనే నవ్వుకున్నారు.

"అనడమేకాని ఆచరణలోలేదుకదా! ఇలాంటి విషయాలు అమలులో పెట్టడం అంతతేలికకాదు. రోజు రోజుకు అధికమవుతున్న లంచాల్లాగె. సంతలో పశువులరేటులాగె."

"పోనీ మరోమాట అనకపోయారా?"

"అనకేం అన్నాను. ఇన్నీకలిపి ఇరవై ఇస్తామన్నాను. "వాళ్ళకి లాంఛనాలతోసహా నలభైవేలు కావాలిట"

"అంటే లాంఛనాలు. పదిహేనువేలా!"

"అన్నమాటే! పిల్లవానికి పర్మనెంటు ఉద్యోగమట. అందుకే అంతరేటు"

"అయితే ఈ సంబంధం కూడా చెడిపోయినట్లేనాండీ" ఆవిడలోని బాధఅంతా ఆవిడ కంఠంలో ధ్వనించింది.

"బాధపడి ఏంచెయ్యలేం" ఆయన మాటల్లో విరక్తి ధ్వనించింది.

అప్పటికి ఎన్నోసంబంధాలు చూశారు ఆయన. అందరూ పిల్ల నచ్చిందంటారు. తర్వాత కట్నం ఇస్తామన్న దానికంటే రెట్టింపు అడుగుతున్నారు. అసలు పిల్లకి పెళ్ళి చెయ్యలేమేమో అన్న అనుమానం ఆయనలో కలిగింది.

పిల్లపెళ్ళి చూడలేమేమో అన్న బెంగ ఆవిడను క్రుంగ దీసింది.

గదిగుమ్మందగ్గరే నిలబడింది కూతురు. తల్లితండ్రుల సంభాషణంతావింది. తనవల్ల తల్లితండ్రులు పడుతున్న బాధను అర్థంచేసుకుంది. ఆమె మనస్సు చలించింది. కళ్ళొత్తుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది. కూతుర్ని చూసిన తండ్రి గుండె చెరువయింది. ఆయన ఊపిరిని ఎవరో బలవంతంగా ఆపినట్టయింది. అలాగె కుర్చీలో కూర్చుండిపోయారు. అంతకంటె ఏమీచెయ్యలేక.

అప్పటికే కూతురికి పాతికేళ్ళు దాటాయి. పదేళ్ళనుంచి సంబంధాలు చూస్తూనె ఉన్నారు. ఎందరో వచ్చి వెడుతున్నారు. అందరికీ పిల్ల నచ్చుతోంది. కట్నంచాలకే అన్ని సంబంధాలు చెడిపోతున్నాయి. అయినా ప్రయత్నం చేస్తూనె ఉన్నారు. ఆదర్శవంతుడైన యువకుడు ఒక్కడేనా దొరక్కపోతాడా అన్న ఆశ ఉంది ఆయనలో. పెద్దపెద్ద చదువులు చదువుకున్నవారిలోకూడా వ్యక్తిత్వమే లేకుండా పోయిందని బాధపడ్డారు. మిగిలిన విషయాల్లో తల్లితండ్రులమాట ఏతనయుడూ వినకపోయినా, కట్నం విషయంలోమాత్రం తల్లితండ్రులమాట జవదాటనికొడుకులే అంతా అని వాపోయారు.

భయభక్తులతో పెరిగిన పిల్లఅవడంవల్ల ఆపిల్లకూడా తల్లి తండ్రులచాటునే ఉండిపోయింది. ఎవరినో ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనే ధోరణులు ఆమెలోనూలేవు. కట్నమే ఆమె జీవితానికి శాపంలా పరిణమించింది.

అలాగె కుర్చీలో కూర్చుండిపోయిన భర్తను బాధగా చూసింది రాజ్యలక్ష్మిగారు. ఆయన మనస్సును సమాధానపరిచే శక్తి ఆవిడకులేదు.

"అన్నం వడ్డిస్తున్నా లేవండీ" నిత్యావసరవిధిని జ్ఞాపకం చేసింది. ఆమాట విన్న చలపతిరావుగారు సమాధానం ఇవ్వకుండానె కుర్చీలోంచి లేచారు.

"ఇంటర్వ్యూ అయిందా" పక్కనే భోజనం చేస్తున్న కొడుకుని చూసి అడిగారు.

"అయింది" పొడిగా వచ్చింది సమాధానం.

ఒక్కసారి తలెత్తి కొడుకువైపు చూసారు.

తండ్రి ముఖంలోకి చూడలేని కొడుకు తలదించుకున్నాడు.

"అక్కడే టెంపరరీగా పని చేస్తున్న వాళ్ళనే సెలక్టు చేసారు కొడుకు తల వంచుకునీ సమాధాన మిచ్చాడు."

"అంతమాత్రానికీ పిలవడం దేనికి? పైగా ఇరవై రూపాయల పోస్టరు ఆర్డరు దేనికి ?"

అదంతా ఒక పెద్ద ప్రొసీజరు"

"అదిసరే! మరి మొన్న జరిగిన ఇంటర్వ్యూ ఈరోజు తెలియాలేమో?"

"అదీ తెలిసింది. పదిహేను వేలు ఇచ్చిన వారినీ మెరిట్ అభ్యర్థులుగా ఎన్నిక చేసారుట వారికే ఆర్డర్సు ఇచ్చారుట.

"అదేమిటండి" ఆశ్చర్యంగా అడిగింది తల్లి.

"పిచ్చిదానా? అంత ఆశ్చర్య పడతావెందుకు? డబ్బున్న వారిదే లోకం."

ఆవిడ నమ్మలేకపోయింది. ఆవిడ నమ్మలేకపోయినా నష్టం ఎవరికి? ఎప్పటికైనా ప్రయత్నం ఫలిస్తుందనే ఆదేమనిషిని బ్రతకనిస్తుంది? అ ఆశే నశిస్తే మనిషి మరణించినట్లే? ఎప్పటికైనా మానవత్వం ఉన్న మనుషులు సహాయపడతారనే ఆశతోనె అప్లికేషన్లు పెడుతున్నారు. ఇంటర్వ్యూలకు వెడుతున్నారు.

"ఈపూట ఫ్యాక్టరీకి వెళ్ళరా? అప్పుడే తొమ్మిదయింది" గుర్తు చేసింది భార్య

"వెళ్ళాలి" ఆయన పీటమించిలేచాడు.

ఆయనవెనకీ నాలుగడుగులు వేసింది ఆవిడ. ఆయన చెయ్యి కడుక్కొని తుడుచుకుంటున్నారు.

"బియ్యం నిండుకున్నాయి." ఎప్పటినుంచో చెప్పాలని ప్రయత్నిస్తోంది. అన్నం తింటుండగా అ విషయంకూడా చెబితే ఇంక ఆయన అన్నంకూడా తినలేరని ఆవిడకు తెలుసు. అందుకే భోజనం చేసేవరకు అగింది. అలాటి విషయాలు చెప్పి భర్తను

బాధ పెట్టాలని ఆవిడా బాధ పడుతూనే ఉంది చెప్పకపోతే ఇంటిడి మంది రాత్రి వస్తుండాలి అందుకే చెప్పడానికి అంత సంకోచం. చెప్పలేక చెప్పలేక చెప్పింది.

"రాత్రికి కూడాలేవా?"

"లేవండీ! అన్నట్లు ఇంటాయన అద్దెకోసం పదిసార్లు వచ్చి వెళ్ళాడు" నసుగుతూనె అనేసి ఊపిరిగట్టిగా పీల్చుకుంది.

ఆయన ఏ సమాధానం చెప్పలేదు. ఆయన మనస్సు పరి పరి విధాల పోతోంది. ఎంత పంపాదించినా సంసారం నడవడమే కష్టంగాఉంది పైగా కొడుక్కు బి.ఎ చెప్పించడానికి అప్పులు చేసారు? ఇల్లూ, భూమీ ఏమీ లేవు.

ఉద్యోగంలో చేరినకొత్తలో ఎన్ని ఆశయాలు.

కట్నం అడిగే వానికి పిల్ల నివ్వకూడదని ఎన్నోసార్లు అనుకునేవారు. లంచం ఇచ్చే వాడిని జైల్లోపెట్టించాలని, ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేయించాలని అమకునే వారు.

కాని బాధ్యతలు మీదపడ్డ తరవాత, లోకాన్ని బాగా అర్థం చేసుకున్న తరువాత అవన్నీ ఎండ మావులని తీరే ఆశయాలు కావని తెలుసుకున్నారు.

ఈనాడు కట్నం ఇవ్వనిదే కూతురు పెళ్ళి అయ్యే దారి లేదు. లంచం ఇవ్వనిదే కొడుక్కి ఉద్యోగం దొరికే సూచనలేదు. కాని ఆ రెండు ఇచ్ఛశక్తి మాత్రం ఆయనకు రాలేదు.

కొడుక్కి ఉద్యోగం దొరికితే వేసిళ్ళకి చన్నీళ్ళు సాయం అవుతాయనుకున్నాడు. జీవితంలో ఎన్నోకలలు కన్నాడు. ఒకటీ తీరే దారి కనబడలేదు.

చలపతిరావుగారు ఫ్యాక్టరీలో మిషను ముందు నిలబడి ఉన్నాడు. మిషను గిర్రున తిరుగుతోంది. అంతకంటే వేగంగా అతని ఆలోచనలు తిరుగు తున్నాయి. లోకం దృష్టిలో తాను అసమర్థుడు. మరో మాటలో చెప్పాలంటే దురదృష్టవంతుడు.

అంతలో ఫైల్సు పట్టుకుని వస్తున్న శేషగిరి ఎదురయ్యాడు. హడావిడిగా వెడుతూనె ఆయాన్ని చూసి ఆగిపోయాడు.

చలపతిరావుగారు 'ఏమిటి?' అన్నట్లు చూసారు.

"చూసారా! పాపం మొన్న మిషన్లో పడిపోయిన రామయ్యకు కంపెనీవారు ఏభై వేలు శాంక్షన్ చేసారండీ ఇంత త్వరగా వస్తుందనుకోలేదు. ఈ మేనేజరు చాలా మంచివాడండీ" చెప్పడం పూర్తిచేసి అతను ముందుకు వెళ్ళిపోయాడు. శేషగిరి మాటలు ఆయనలో ఎన్నో ఆలోచల్ని రేపాయి. ఏదో ఆశ అతనిలో చటుక్కున మెరిసింది. తను అదృష్టవంతుడనిపించుకోవాలి. తన కూతురు పెళ్ళికాకుండా ఉండిపోకూడదు. తన ఉద్యోగం పోయినా తన కొడుక్కి ఉద్యోగం దొరికి ఒక ఇంటివాడు కావాలి. కూతురు, కొడుకు కళ్ళ ఎదుట కళకళలాడుతూ తిరగాలి.

అతని ఆలోచనలు అలా సాగిపోతున్నాయి.

అంతలో "మిషను ఆపండి - ఆపండి" జనం అరుపులు, కేకలు, ఫ్యాక్టరీలోని జనమంతా గుమిగూడారు.

ఎవరో స్విచ్చి ఆపు చేసారు, మిషను ఆగిపోయింది. రక్తపుమడుగు మధ్యలో కొట్టుకుంటున్న చలనం లేని చలపతిరావుగారిని హాస్పటల్‌కి తీసుకువెళ్ళారు.

ఆ వార్త తెలిసిన భార్యా పిల్లలు పరుగెత్తు కొచ్చారు. ఆయన్ని చూసి వెక్కి-వెక్కి ఏడ్చారు. డాక్టరు చేతులు పట్టుకుని ఆయన్ని బ్రతికించమని ప్రాద్ధేయపడ్డారు.

డాక్టరు చేతనైన వైద్యం చేసాడు. రెండు చేతులు తీసి వేయవలసి వచ్చింది.

అతనినిచూసిన కొందరు 'అంతకంటె చనిపోయి ఉండ వలసింది' అనుకున్నారు మనస్సులో.

అతనిస్థానంలో కొడుక్కి వెంటనే ఉద్యోగం ఇస్తామన్నారు ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా యాక్సిడెంటు జరగడంవల్ల నష్ట పరి హారంగా యాభైవేలు ఇస్తామన్నారు.

ఆవిషయం తెలిసిన చలపతిరావుగారు హాస్పిటల్లోబెడ్ మీద హాయిగా పడుకున్నారు.

చేతులు తీసివేసిన భర్తనుచూడలేక భార్య వెక్కి- వెక్కి- ఏడ్చింది.

"వెర్రిదానా ఏడుస్తావెందుకు? చేతులుపోతేనేమి చూసావా? బాబుకి ఉద్యోగం దొరికింది. అప్పులుపోను పిల్ల పెళ్ళి ఆ యాభై వేలలో ఘనంగా జరుపుకోవచ్చు. ఇంతకంటె ఏంకావాలి చెప్పు"

భర్త మొండిచేతులు తడుముతూ ఆయనవైపు బాధగా చూసింది ఆవిడ.

ఆయనముఖం ఆనందంతో వెలిగిపోతోంది. అర్థంకాక ఆవిడ అలాగె చూస్తూ ఉండిపోయింది.

"వెర్రిదానా! అలా ఆశ్చర్యపోతావెందుకు. త్యాగానికి ఫలితంగా దొరికింది. ఇంతకంటె ఏం కావాలి? ఇప్పుడు నేను అదృష్టవంతుడిని"

ఆవేశంగా మాట్లాడుతున్న భర్తను ఆశ్చర్యంగా చూసింది ఆవిడ. "అంటే మీరు.. మీరు కావాలనే ..." ఆవిడ మాటలు తడబడ్డాయి.

అవునన్నట్లు తలూపారు. పోయిన రెండు చేతుల వైపు గర్వంగా చూసుకున్నారు. భర్త త్యాగం భరించలేని భార్య గుండెలు బరువెక్కాయి.